# మోడీ, జగన్ నుండి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే సీపీఐ బస్సు యాత్ర

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య



విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : మోడీ నుండి దేశాన్ని, జగన్ నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో సిపిఐ నేతృత్వంలో చేపడుతున్న బస్సు యాత్ర పోరాట కార్యక్రమాన్ని జయ ప్రదం కోసం ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, విజయనగరం జిల్లా సీపీఐ నిర్మాణ బాధ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సోమవారం అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వల్లకాడుగా తయారు అయిందని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం జగన్ పరిపాలనను గాలికి వదిలేసి కార్యాలయంలో కూర్చుని బటన్ నొక్కడం, ఢిల్లీ వెళ్ళి మోడీ చుట్టూ ప్రదక్షిణలు చేయడం తప్పా రాష్ట్రాభివృద్ధి పై దృష్టిలేదని అలాంటప్పుడు జగన్ విశాఖలో ఉన్నా, తాడేపల్లిలో ఉన్నా, లేక సముద్రంలోని ఓడలో ఉన్నా ఆంధ్రాకి ఒరిగేది, పోయేది, వచ్చేది ఏమి ఉండదని విమర్శలు చేశారు. సీపీఐ చేపట్టే ఈ బస్సుయాత్రలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సిపిఐ రాజ్యసభ సభ్యులు బినయ్ విశ్వం, సిపిఐ జాతీయ కార్యదర్శులు అమరజిత్ కౌర్, కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ లతో పాటు రాష్ట్ర నాయత్వం పాల్గొంటారని ఈశ్వరయ్య తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, తిరోగమన విధానాలపై ప్రజలను చైతన్యం చేయటానికి ఈ యాత్ర ప్రధాన ఉద్దేశ్యమని అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అన్ని రకాల అప్పుల పై చర్చించేందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని జరపాలని ఆయన కోరారు. మరోవైపు అమర్ రాజా కంపెనీ బస్సుపై, ఉద్యోగులపై వైసీపీ శ్రేణులు చేసిన దాడిని తీవ్రంగా ఖండించాలని అన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నుల భారాలు మోపుతూ, కార్మికులను బానిసలుగా మార్చేందుకు 44 లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారని, 3 వ్యవసాయ చట్టాల రూపంలో రైతాంగ భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నించారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం తీసుకొచ్చే విశాఖ ఉక్కు, ఎల్ఐసి, ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటు దోపిడీదారులకు అప్పగించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారన్నారు. గత 9 ఏళ్ల కాలంలో ఆరు లక్షల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయని, వీటిలో పనిచేసే లక్షలాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. భారతదేశం మోడీ హయాంలో ఆకలి సూచికలో బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలకంటే వెనుకప డినట్లు ప్రపంచ గణాంకాలు తెలియజేస్తు న్నాయని అన్నారు. నిరుద్యోగాన్ని, అధిక ధరలను, ఆహార సంక్షోభాన్ని మోడీ ప్రభుత్వం పరిష్కారం చేయలేక, ప్రజల ఐక్యతకు భంగం కలిగించే వివక్షపూరిత సిఏఏ, ఎన్ఆర్సి, యుసిసి చట్టాలను బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఇందులో భాగంగానే మణిపూర్ రాష్ట్రంలో వందల సంవత్సరాలుగా కలిసున్న మైతే, కుకి ప్రజల మధ్య ఎస్టీ రిజర్వేషన్ల సమస్యను సృష్టించి మారణ హోరీమనికి కారణ మయ్యారని తెలిపారు. మోడీ ఏం మాట్లాడాలో, ఏమి చేయాలో ఆర్ఎస్ఎస్ నిర్ణయిస్తుందని, ఆర్ఎస్ఎస్ మతోన్మాద ఎజెండాను అమలు చేయడమే మోడీ కర్తవ్యంగా భావిస్తున్నారని, ఇక్కడ మోడీ మనసులో భారత రాజ్యాంగానికి గాని, ప్రజాస్వామ్యానికి గాని స్థానంలేదని విమర్శించారు. కార్మికులకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయా లన్నీ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తూ రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు. మోడీ విధా నాలను రాష్ట్రంలో అమలు చేసే పార్టీలకు ప్రజలు, కార్మికులు, మేధావులు ఓటుద్వారా బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు లు పాల్గొన్నారు.

## చెరువుల సుందరీకరణ దిశగా

## నగరంలో ఉపసభాపతి కోలగట్ల పర్యటన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలో చెరువుల సుందరీకరణకు స్థానిక శాసన సభ్యులు, ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి నడుం బిగించారు. ఇప్పటికే నగరంలోని కొన్ని చెరువులను అభివృద్ధి చేసి, స్థానికులకు ఆహ్లాదకర వాతా వరణాన్ని అందించిన విషయం విదితమే. అయితే, కొన్నిచోట్ల నిరాదరణతో వాటి ఉనికిని కోల్పోతున్నాయి. నగర సుందరీకరణకు పెద్దపీట వేస్తున్న కోలగట్ల.. ఈ చెరువులపైనా దృష్టి సారించారు. ఇందులో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పలు చెరువులను నగరపాలక సంస్థ, ఇరిగేషన్ అధికారులతో కలిసి సందర్శించారు. తొలుత పెద్ద చెరువు ట్యాంక్ బండ్ మార్గంతో పాటు.. అటు కర్రల మార్కెట్ వైపునా పరిశీలించారు. అనంతరం బుచ్చన్న కోనేరు, నల్లచెరువు, కోమటి చెరువు, అయ్యకోనేరు తదితర వాటిని పరిశీలించారు. ఆయా చెరువుల వద్ద ప్రస్తుత స్థితిని ఆరా తీస్తూ.. మెరుగైన అభివృద్ధికి ఏమేం చేయాలో అధికారులతో చర్చించారు. కొన్నిచోట్ల పనికిరాని మొక్కలు పెరగడంతో పాటు, అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొత్తంగా ఈ చెరువులను ఆధునికీకరించి.. ఆహ్లాదకర వాతావరణాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. ప్రధానంగా స్థానికులు, వృద్ధులు పిల్లలు నడిచేందుకు వీలుగా వాకింగ్ ట్రాక్ లను సిద్ధం చేయాలని.. మంచి మొక్కలు నాటాలని సూచించారు. వీటి పరిరక్షణ, సుందరీకరణ కోసం అవసరమైతే ఆసక్తి ఉన్న స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాముల నాయుడు, ఫ్లోర్ లీడర్ ఎస్వీవీ రాజేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, జోనల్ ఇన్చార్జులు కంటుభుక్త తవిటి రాజు, బొద్దాన అప్పారావు, కాళ్ల సూరిబాబు, ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభం

విశాలాంధ్ర - దెంకాద : మండలంలోని చల్లంగిపేట గ్రామంలో ఎంపీ ఎం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్ర షాపును సోమవారం ప్రకృతి వ్యవసాయ ఇంచార్జ్ సుజాత ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఈ షాపులు ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందిస్తామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో చల్లంగి పేట గ్రామ సర్పంచ్ కోరాడ కనకరాజు గ్రామ పెద్దలు రైతులు ఏ ఈ ఓ ప్రశాంతి పాల్గొన్నారు.

## మీ అందరి చల్లని దీవెనలతో పాలన చేస్తున్నాం

విశాలాంధ్ర - జామి : మీ అందరి చల్లని దీవెనలు, ఆశీస్సులతో మూడేళ్ళ పాలన మంచి చేసామని, ఇకపై కూడా మంచి చేసి మీ అందరి మన్ననలు పొందుతామని ఎస్‌కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన జామిలోని సచివాలయం-3 పరిదిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లిన ఆయన ముఖ్యమంత్రి పంపిన లేఖను వారికి అందజేసారు. ప్రతీ కుటుంబాన్ని అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీసారు. ఆయా కుటుంబాలకు సంభ:దించి ఏమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకుని పరిష్కారం నిమిత్తం అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. మెరుగైన పాలన అందిస్తున్న జగన్ మోహనరెడ్డికి మీమద్దతు చాలా అవసరమని వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపిపి ఎస్.అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్, జెసిఎస్ చైర్మన్ ఎస్. చంద్రునాయుడు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, స్థానిక నాయకులు అల్లు సత్యాజీ, గ్రామ సర్పంచ్ చిప్పాడలక్ష్మి, ఎంపిటిసి చిప్పాడ సూరి దేముడు, ఎంపిడివో ఎం.సతీష్, ఇవో పిఆర్‌డి శ్రీదేవి, ఎంఇవో గంగరాజు ఇతర అధికారులు పాల్నొన్నారు.

## విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ సైకిల్ సంగ్రామ యాత్ర

విశాలాంధ్ర - భోగాపురం : విద్యారంగ సమస్యలు పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నాయకులు చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర సోమవారం పూసపాట ‘రేగ, భోగాపురం మండలాలలో నిర్వ హించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్. వెంకటేష్ మాట్లాడుతూ ఇప్పటికి 300 కిలోమీటర్లు సైకిల్ యాత్ర పూర్తి చేశామన్నారు. విద్య పట్ల ప్రస్తుతం ప్రభుత్వ విధానాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, ముఖ్యంగా ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో అధ్యాపకుల కొరత ఉందని డిగ్రీ, జూనియర్ కళాశాలలో వెంటనే అధ్యాపకులను నియమించాలని అన్నారు. నిత్యావ సరాల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వసతి గృహాల్లో విద్యార్థులకు చాలీ చాలని భోజనం పెడుతున్నారని. కాబట్టి పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ లు భవనాలు కూలిపోయే దశలో ఉన్నాయని వాటి స్థానంలో తక్షణమే నూతన భవనాలు నిర్మించి, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నారని, దానిలో భాగంగా జీవో 77 తీసుకొచ్చి మొత్తం ఉన్నత విద్యకు మంగళం పాడేసారని అన్నారు. డిగ్రీలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ విధానాన్ని విద్యార్థుల స్థాయికి, సిలబస్‌కు అనుగుణంగా పెట్టాలని డిమాండ్ చేసారు. ఆగష్టు 9తో విజయనగరంలో సైకిల్ సంగ్రామ యాత్ర ముగియనున్న సందర్భంగా ఆరోజువిద్యా వ్యవస్థలో వందలాది సమస్యలపై ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు. ఈ లోగా జిల్లాలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, లేకపోతె తరువాత ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు.

## మెర్సివాల్ (దయగలగొడ) సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర - బొబ్బిలి : నిరుపేదలకు సామాజిక సేవలు అందించేందుకు రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన దయగలగోడ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు అన్నారు. పట్టణంలో గల తహశీల్దార్ కార్యాలయం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన దయగల గోడ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ నిరుపేదలకు సహాయం చేయాలనే ఆలోచన చేసి దయగలగోడ ఏర్పాటు చేయడంతో నిరాశ్రయులకు, పేదలకు సహాయం చేసేందుకు ఇది ఒక మంచి మార్గం అని తెలిపారు. ప్రతి ఒక్కరూ గృహ ఉపకరణాల్లో ఉపయోగించే బట్టలు, దుప్పట్లు, పుస్తకాలు ఇతర వస్తువులు ఈ దయగలగోడ ద్వారా నిరుపేదలకు సహాయం అందించాలని కోరారు. అనంతరం ఆయన చేతుల మీదుగా ఊరు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శేష శైలజ, తహశీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ రవికుమార్, 1వ వార్డు కౌన్సిలర్ చోడగంజి రమేష్ నాయుడు, పట్టణ జేసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, అడ్వకేట్ రుంకాన ప్రసాద్, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ప్రతి వినతినీ పరిష్కరిస్తున్న తీరును సమీక్షించాలి

## జగనన్నకు చెబుదాం వినతులపై ఇంఛార్జి కలెక్టర్ మయూర్ అశోక్

విశాలాంధ్ర - విజయనగరం : జగనన్నకు చెబుదాంలో ప్రజల నుంచి అందే ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో ఏవిధంగా పరిష్కరి స్తున్నారనే అంశంపై మండల ప్రత్యేకాధికారులు తప్పని సరిగా సమీక్షించాలని జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు అందుతున్న వినతులు, అర్జీదారుల సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించే రీతిలో తగిన చర్యలు తీసుకుంటున్నదీ లేనిదీ పర్యవేక్షించాలన్నారు. మండలాల్లో అధికారులతో సమావేశాలు నిర్వహించేటపుడు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జగనన్నకు చెబుదాం వినతుల పరిష్కారంపై ఇన్‌ఛార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం జిల్లా అధికారులతో కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో సమీక్షించారు. గృహనిర్మాణ శాఖకు సంబంధించి వచ్చిన వినతుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టకుండానే వాటిని మూసివేసి అర్జీదారుల అసంతృప్తికి కారణమైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, షోకాజ్ నోటీసులు జారీచేయాలని గృహనిర్మాణ సంస్థ పి.డి.ని ఆదేశించారు.

### ఉద్యోగుల వినతుల పరిష్కారంపైనా సమీక్ష

ఇటీవల ఉద్యోగుల వినతుల స్వీకారం కోసం నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో పలు శాఖల ఉద్యోగుల నుంచి అందిన వ్యక్తిగత వినతుల పరిష్కారంపై కూడా ఇన్ ఛార్జ్ కలెక్టర్ సమీక్షించారు. ప్రజా రవాణా, వ్యవసాయ శాఖలకు సంబంధించిన ఉద్యోగుల సమస్యలపై కూడా తీసుకున్న చర్యలను తెలుసుకున్నారు. జగనన్నకు చెబుదాంలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో సోమవారం పలు వర్గాల నుంచి వినతులు అందాయి. జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్, డి.ఆర్.ఓ. ఎం.గణపతిరావు, ఆర్.డి.ఓ. ఎం.వి.సూర్యకళ, కె.ఆర్.ఆర్.సి. డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, డిప్యూటీ కలెక్టర్‌లు పద్మలత, సుధారాణి, లావణ్య వినతులు స్వీకరించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు.

## నగరపంచాయతీ అభివృద్ధికి ప్రాధాన్యత

విశాలాంధ్ర - నెల్లిమర్ల : నెల్లిమర్ల నగరపంచాయతీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చైర్ పర్సన్ బంగారు సరోజిని, వైసిపి కన్వీనర్ చిక్కాల సాంబశివరావు అన్నారు. నగర పంచాయతీ పరిధి 9వ వార్డు చంద్రబాబు కాలనీలో సీసీ రహదారి నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సహకారంతో నగర పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పి స్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కారుకొండ కృష్ణ, కౌన్సిలర్ బూర సుజాత, వార్డు కన్వీనర్ బూర సత్యనారాయణ, జెసిఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, నాయకులు బంగారు శంకరరావు, చిక్కాల రవి పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితురాలిని పరామర్శించిన గొంప

### రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేత

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని చామలాపల్లి గ్రామంలో ఆదివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితురాలు మిగడ లక్ష్మీకాంతంను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ పరామర్శించి రూ. 5వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. అగ్ని ప్రమాదంలో లక్ష్మీకాంతం ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలింది. విషయం తెలుసుకున్న టిడిపినేత గొంప కృష్ణ గ్రామానికి చేరుకొని పరామర్శించడంతో పాటు తనవంతుగా రూ. 5వేలను, బట్టలు అందజేసి ఆదుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బాధితరాలను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు, మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, నాయకులు జనపరెడ్డి ఈశ్వరరావు, ఎర్రప్రగడ సూర్యం, సేనాపతి గణేష్,జగన్ పలువురు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజనుల ‘భూ’ సమస్యలు పరిష్కరించండి

### సీపీఐ సీనియర్ నాయకులు చాపర సుందర్‌లాల్

విశాలాంధ్ర - సీతంపేట : గిరిజనుల పోడు భూమి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి కి వినతి పత్రాన్ని సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు ఛాపర సుందర్‌లాల్ ఆధ్వర్యంలో గిరిజనులు ఇవ్వడం జరిగింది. ఎం.జి పురం పంచాయతీ, బాలిగం గిరిజన గ్రామంలో ఎనిమిది కుటుంబాలు నివాసం ఉంటూ గతంలో ప్రభుత్వం ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూ హక్కు పత్రాలను ఇచ్చి ఆ భూమిలో గత ఆరు సంవత్సరాల నుండి గిరిజనులు జీడి మామిడి తోటలు సాగు చేస్తున్న తరుణంలో ఒక ఫారెస్ట్ గార్డు వచ్చి తాము సాగు చేస్తున్న జీడి మామిడి చెట్లను ధ్వంసం చేసి తాము నివసిస్తున్న గృహాలను కూడా ధ్వంసం చేస్తామని హెచ్చరించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఐటిడిఏ పిఓ కల్పన కుమార్ దృష్టికి గిరిజన సమైక్య జిల్లా నాయకుడు సవర హరికృష్ణ తీసుకువెళ్లారు, పివో స్పందిస్తూ గార్డుపై విచారణకు అందుబాటులో ఉన్న ఫారెస్ట్ అధికారులు పిలిపించుకొని ఫోన్లో మాట్లాడడం జరిగింది. అదేవిధంగా బాలి గాం గ్రామానికి రెండు కిలోమీటర్లు రహదారి మంజూరు చేయాలని పిఓ కి తెలిపారు, అదే విధంగా పలాసలో ప్రభుత్వ ఐటిఐ లో గిరిజన విద్యార్థిలుకు పూర్తిస్థాయిలో చదువుకొనుటకు సీట్లు సర్దుబాటు చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా అక్కడే విధులు నిర్వహిస్తున్న ఐటిఐ ప్రిన్సిపాల్ ని బదిలీ చేసి, ఐటిఐ లో విద్యాబోధన నేర్పుటకు ఇన్స్ట్రక్టర్లు నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సవర జైపాల్ పాల్గొన్నారు.

## నాసాలో సత్తా చాటిన పార్వతీపురం మన్యం జిల్లా శ్రీచైతన్య విద్యార్థులు



విశాలాంధ్ర - బెలగాం : ప్రగతికి మారుపేరు, సస్యశ్యామలమైన పార్వతీపురం మన్యం జిల్లాలో గల శ్రీచైతన్య పాఠశాలలో నాసా సెటిల్మెంట్ అవార్డుల కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గత ఏడాది జాతీయ స్థాయిలో పాఠశాలలో నిర్వహించిన స్పేస్ హోటల్, స్పేస్ కాలనీ, స్పేస్ మైనింగ్ ప్రాజెక్టులలో 24 మంది విద్యార్థులు పై మూడు ప్రాజెక్టులు చేయగా అందులో 8 మంది విద్యార్థులు చేసిన ప్రాజెక్టులు జాతీయ స్థాయిలో పార్వతీపురం మన్యం జిల్లా శ్రీచైతన్య పాఠశాల ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఈ నాసా కాంటెస్టులో గెలుపొందిన విద్యార్థులకు ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజిఎం ఎంవి సురేష్ బాబు, రీజనల్ ఇంచార్జి శ్రీనివాసరావు, కో ఆర్డినేటర్ బాలరాజు, స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ బి. జగదీష్, పాఠశాల డీన్ పి. సుదర్శన, సి బ్యాచ్ ఇంచార్జి ఎం. రవికుమార్, నాసా ఇంచార్జి టి. రామకృష్ణ, ప్రైమరీ ఇంచార్జి సంధ్య, ప్రీప్రైమరీ మేడమ్ లత బహుమతులను అందజేసారు. ఈ అద్భుత ఘన విజయాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపాల్ బి. జగదీష్ మాట్లాడుతూ వై. కిరణ్, మోసే మహారాజ్, దైవిక్సాము, పి.వర్ధన్, టి. ధనేష్, వై. హర్షిత్, ఆర్. చిన్నికృష్ణ, పి. ఓంకారేశ్వర విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో చేసిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి గెలుపొంది పార్వతీపురం మన్య జిల్లా శ్రీచైతన్య పాఠశాల కీర్తిని విశ్వవ్యాప్తంగా చేసినందుకు ఆనందంగా ఉందని, విద్యార్థులు శాస్త్రీ దృక్పథాన్ని అలవరుచుకుని, దేశానికి కీర్తి ప్రతిష్టలు సాధించ గలిగే వ్యక్తులుగా ఎదగాలని అభిలాషించారు.

## విష సర్పాల భారి నుండి విద్యార్థులను రక్షించండి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : విషసర్పాల భారి నుండి విద్యార్థులను రక్షించాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. సోమవారం పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్‌ను జనసేన పార్టీ నాయకులు వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్‌లు కలిసి జిల్లాలో దోమలు, పాములు కుట్టటం వలన విద్యార్థుల మరణాలు జరగకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగాలు సీజన్ ఆరంభమైందో లేదో విద్యార్థుల మృత్యువాత ఘంటికలు మోగడం ప్రారంభించాయన్నారు. ఈ ఆట దోమలు, పాములు కరిచి కుట్టి పలువురు చిన్నారులు మృత్యువాత పడుతున్నారన్నారు. దోమలు, పాములు కుట్టకుండా ఆయా వసతి గృహాలు రెసిడెన్షియల్ పాఠశాలలు కళాశాలలో తగు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వసతి గృహాలలో మెనూ సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు.

## చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి : కేంద్ర మాజీ మంత్రి కిషోర్ చంద్రదేవ్

విశాలాంధ్ర - కురుపాం : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని కేంద్ర మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వైరి చర్ల కిషోర్ చంద్ర సూర్యనారాయణ దేవ్ పిలుపునిచ్చారు. సోమవారం చిన మేరంగి శత్రుచర్ల కోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఈనెల 9వ తేదీన తోటపల్లి ప్రాజెక్టు పరిశీలనకు వస్తున్నారని రైతులతో ప్రత్యేక సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. రానున్న పార్లమెంట్ అసెంబ్లీ ,ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధిస్తుందనీ, చంద్రబాబు మళ్ళీ ముఖ్య మంత్రి కావడం ఖాయమన్నారు .కురుపాం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకుల్లో ఎటువంటి విభేదాలు లేవని అందరం కలిసికట్టుగా పనిచేస్తున్నామని రానున్న ఎన్నికల్లో కురుపాం నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. మాజీ మంత్రి విజయరామరాజు మాట్లా డుతూ చంద్రబాబు పర్యటనలో భాగంగా తోటపల్లి ప్రాజెక్టు ఆవరణలో రైతులతో ప్రత్యేక సమావేశం జరుగు తుందని ఆ సమావేశానికి పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు పనులకు చంద్రబాబు శంకు స్థాపన చేశారని ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన జరిగేటట్లు చర్యలు తీసుకు న్నారని ప్రాజెక్టు ప్రారంభించారని ఆమె అన్నారు అదనపు ఆయకట్టు పంట భూములకు సాగునీరు అందించడానికి నిధులు మంజూరయ్యాయని నాలుగు సంవత్సరాల కాలంలో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క పని కూడా చేయలేదన్నారు ప్రజా వ్యతిరేక విధానాలు చేపడుతున్న వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ టీ జగదీశ్వరి నియోజకవర్గం పరిశీలకులు ఆరేటి మహేష్ కురుపాం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మిషన్ ఇంద్ర ధనుష్ టీకా పరిశీలించిన డీఐఓ

విశాలాంధ్ర - బెలగాం : మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమంలో పూర్తిస్థాయిలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయా లని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన 15, 19 వార్డులకు చెందిన అంగన్వాడి కేంద్రంలో వైద్య సిబ్బంది నిర్వహించిన మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. గత సర్వేలో గుర్తించిన ఎంతమంది అర్హులైన పిల్లలకు, గర్భిణీలకు వ్యాక్సినేషన్ ప్రణాళిక వేశారు, ప్రస్తుతం వారికి ఏ టీకా వేస్తున్నారు అనే అంశాలను ఆయన పరిశీ లించారు. యూవిన్ పోర్టల్ లో టీకా వివరాల నమోదు త్వరగా పూర్తి చేయాలన్నారు. నేటి నుండి ప్రారంభమైన మిషన్ ఇంద్ర ధనుష్ మొదటి దశ టీకా కార్యక్రమాన్ని ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగించాలని, ఏఏ ప్రాంతాల్లో టీకా కేంద్రం ఏర్పాటు చేయనున్నది వేయబడిన ప్రణాళిక ప్రకారం, ముందుగానే యూవిన్ లో నమోదు చేయాలని, అర్హులను ముందుగానే రిజిస్ట్రేషన్ చేసి టీకా పూర్తైన తర్వాత పూర్తి వివరాలు వెంటనే నమోదు చేయడం ద్వారా వారికి టీకా సర్టిఫికేట్ ఇచ్చే వీలుంటుందన్నారు. తద్వారా టీకా నిర్వహణ మరింత ఖచ్చితంగా ఉండి, తట్టు, రూబెల్లా మొదలగు వ్యాధులను పూర్తి స్థాయిలో నిర్మూలన సాధ్యమవుతుందన్నారు ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు పుష్ప, జయగౌడ్, ఎఎన్ఎం లు నారాయణమ్మ, సావిత్రమ్మ, అంగన్వాడీ సిబ్బంది జ్యోతి, రాజేశ్వరి, భారతి, సూర్య కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 13 కేజీల గంజాయి పట్టివేత...ఇద్దరు అరెస్ట్

విశాలాంధ్ర - పాచిపెంట : మండలం లోని పీకాన వలస చెక్పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వ హిస్తుండగా ఒడిస్సా రాష్ట్రంలోని జైపూర్ నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు పట్టుబడినట్లు ఎస్సై ప్రకృదిన్ తెలిపారు . ఆయన కథనం ప్రకారం బత్తిన చందు అనబడే వ్యక్తి తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల జిల్లా కు చెందినవారు కాగా రెండవ వ్యక్తి తుమ్మ నాగరాజు తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా కు చెందిన వారిగా గుర్తించారు. జైపూర్ నుంచి విశాఖపట్నం వరకు రోడ్డు మార్గంలో సాధారణ ప్రయాణికుల వలె ఆర్టీసీ బస్సులో ప్రయాణించి విశాఖపట్నం నుంచి రైలు మార్గం ద్వారా హైదరాబాద్ చేరుకొని ఉస్మానియా యూనివర్సిటీ తార్నాక ప్రాంతంలో వీరు గంజాయి అమ్మడానికి అలవాటు పడి నట్లు తెలిపారు ఇద్దరు యువకులను అరెస్టు చేసి తాసిల్దారు వారి సమక్షంలో గంజాయి తూకం వేయగా మూడు ప్యాకెట్లు కలిపి 13 కేజీలు గుర్తించడం జరిగిందని అన్నారు. కేజీ ఒక్క%శీ%టికి మూడు వేల రూపాయలు చొప్పున సుమారు 40000 రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసినట్లు తెలిపారు ఉస్మానియా యూనివర్సిటీ తార్నాక ప్రాంతంలో కేజీ 10 వేలకు అమ్మటం ద్వారా అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారనీ అన్నారు ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సాలూరు రూరల్ సిఐ ధనుంజయ రావు కేసు దర్యాప్తు చేస్తున్నారనీ తెలిపారు.

## నా భూమి - నాదేశం, నేల తల్లికి నమస్కారం

## - వీరులకు వందనం పనుల పరిశీలన

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో అజాద్ కా అమృత్ ఉత్సవ్ లో భాగంగా నాభూమి- నా దేశం, నేలతల్లికి నమ స్కారం - వీరులకు వందనం కార్య క్రమాన్ని ఈనెల 9 నుండి నిర్వహి స్తున్నట్లు ఎంపిడిఓ ప్రసాద్, ఈఓపిఆర్డీ వర్మలు తెలిపారు. సోమ వారం వారు మండలంలోని చిన్నారాయుడుపేటలో దీనికి సంబంధించి పాటశాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. అమృత సర్ చెరువులు వద్ద లేదా పాటశాలలవద్ద దేశ సంక్షేమం కోసం ప్రాణ త్యాగాలు చేసిన వారి పేర్లను శిలాఫలాలపై ముద్రించి ఇక్కడ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనికి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 9న శిలాఫలకాల ఏర్పాటు, 10న ప్రతిజ్ఞ, 11నవందనం పేరుతో 75మొక్కలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇదొక మంచి కార్యక్రమమని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దొర, సెక్రటరీ సంతోష్ పాల్గొన్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం సిబ్బంది ద్వారా ఈపనులు ముమ్మరంగా సాగుతు న్నాయన్నారు.

### నేటినుంచి మూడు వార్డులకు నామినేషన్లు స్వీకారం

మండలంలోని జోగమ్మపేట గ్రామ పంచాయతీలోని రెండు వార్డులకు, లచ్చయ్యపేటలోని ఒక వార్డు సభ్యులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల జరిగిందని, మంగళవారం నుండి నామినేషన్లు స్వీకరణ ఉంటుందని ఎంపిడిఓ ప్రసాద్, ఈఓపిఆర్డీ వర్మలు తెలిపారు.

## జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ



విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లా పార్వతీపురం ఉమ్మడి విజయనగరం జిల్లా, సాలూరు నియోజకవర్గం, మక్కువ మండలం, కన్నంపేట గ్రామ జనసైనికుల ఆధ్వర్యంలో నిర్వహించిన జనసేన జెండా ఆవిష్కరణ మరియు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి శ్రీ బాబు పాలూరు గారు మరియు వీరితో పాటుగా కార్యక్రమంలో పాల్గొన్న సాలూరు నియోజకవర్గ నాయకులు రేగు మహేష్, మక్కువ మండల నాయకులు గేదెల రిషి వర్ధన్, సాలూరు మండల అధ్యక్షులు శివ, బొబ్బిలి మండల అధ్యక్షులు సంచాన గంగాధర్, సీతానగరం మండల నాయకులు పోతల శివ శంకర్ మరియు జనసేన నాయకులు. సమావేశం అనంతరం శ్రీ బాబు పాలూరు గారు వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలను జనసేన కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానం పలికి, గ్రామ స్వరాజ్యం జనసేన పార్టీ ద్వారానే సాధ్యమని, కన్నంపేట గ్రామ ప్రజల నుంచి వచ్చిన అశేషమైన స్పందన, మీ మద్దతు 2024 వరకు ఇలాగే కొనసాగించి, గాజు గ్లాసు గుర్తుకి ఓటేసి, జనసేన ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించడానికి దోహదపడాలని పిలుపునిచ్చారు.

# చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం : జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విజయనగరం : చేనేత కార్మికులకు అన్ని విధాలా అండగా నిలిచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డికే దక్కిందని, జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు కొనియాడారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని సోమవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్వజన ఆసుపత్రి జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు హేండలూమ్ వాక్ నిర్వహించారు. కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద చేనేత వస్త్ర ప్రదర్శన శాలను, జెడ్‌పి ఛైర్మన్ ప్రారంభించారు. జిల్లా అధికారులు, సిబ్బంది చేనేత వస్త్రాలను ధరించారు. చేనేత వస్త్రాల ప్రాశస్త్యాన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వివరించారు. పలువురు నేత కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో, చేనేత కార్మికుల కష్టాలను తెలుసుకొని, అధికారంలోకి వచ్చిన వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. గత ప్రభుత్వాలు పట్టించుకోని, నేత కార్మికులను ఎన్నో పథకాలతో ఆదుకున్నారని అన్నారు. దీనిలో భాగంగా వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం క్రింద ప్రతీఏటా రూ.24,000 చొప్పున జిల్లాలోని 3,595 మందికి చెల్లించడం జరిగిందన్నారు. అలాగే ముద్ర పథకం క్రింద రూ.50వేలు నుంచి రూ.5లక్షలు వరకు రుణాలను, సొసైటీలకు డిసిసిబి ద్వారా రుణాలను ఇప్పించడం జరుగుతోందని అన్నారు. ముఖ్యంగా నేత వృత్తిదారులకు 50 ఏళ్లు నిండితే చాలు పింఛను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఈ విధంగా జిల్లాలో 3,165 మంది నేతన్నలు చేనేత పింఛన్ పొందుతున్నారని తెలిపారు. సుదీర్ఘకాలంగా వృత్తిని కొనసాగిస్తున్న సీనియర్ చేనేత కార్మికులు ఎం.పెంటయ్య, బల్ల ఈశ్వర్రావు, నాయుడు సత్యారావులను జెడ్‌పి ఛైర్మన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎస్.కోట ఎంఎల్‌ఏ కడుబండి శ్రీనివాసరావు, వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, డిఆర్‌ఓ ఎం.గణపతిరావు, చేనేత జౌళిశాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.వసంతసాయి, సిబ్బంది, వివిధ చేనేత సొసైటీలు, నేత కార్మికులు పాల్గొన్నారు.

## పట్టణంలో పల్సర్ బైక్ రమణ సినిమా షూటింగ్ సందడి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : పట్టణంలో గంట స్తంభం దగ్గరపల్సర్ బైక్ రమణ సినిమా షూటింగ్లో పాల్గొని సందడి చేశారు, కుమారస్వామి దర్శకత్వంలో పల్సర్ బైక్ రమణగారు నటిస్తున్న ఈ చిత్రానికి బేబీ-2. టైటిల్ ఖరారు చేయడం జరిగింది అని దర్శకుడు కుమారస్వామి తెలిపారు. ఈ షూటింగ్ వీక్షించడానికి స్థానికులు మరియు ఔత్సాహికులు ఎంతో ఉత్సాహంతో వచ్చి వీక్షించారు. ఈ బేబీ 2.0 సినిమా యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా ఇప్పుడు ఉన్న యూత్ అందరికీ కనెక్ట్ అవు తుందని చిత్ర బృందం తెలిపారు చిత్రానికి హీరోయిన్ సోనీ రెడ్డి కాగా ప్రతి నాయకుడు గా ప్రశాంత్ గురవాన నటిస్తున్నారు. సినిమాటో గ్రాఫర్ గా హరీష్ కోరాడ ఎడిటర్‌గా ప్రసాద్ బొట్ల పాటల రచయితగా, సంగీతం జాన్,గణేష్ కెల్లా మేకప్ శిరీష శ్రేష్ఠ సహాయ దర్శకులుగా అజయ్ కండి ఎస్‌విఎస్ కావ్య శ్రీ అనిల్ గాంధీ పనిచేయగా ప్రొడక్షన్ మేనేజర్‌గా రితిక్ గాదిపల్లి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ గా రెడ్డి స్వామి వ్యవహరించారు దీనికి లైటింగ్ యూనిట్ డీజే.నాయుడు సౌండ్స్ స్టిల్స్ రామకృష్ణ ఇతర సాంకేతిక నిపుణులు, పనిచేయనున్నారు అలాగే రాము,శివ పైడినాయుడు పాల్గొన్నారు.

## కేజ్యువల్ వేకెన్సీస్ నోటిఫికేషన్

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో ఎండీఓ ఎస్ రామకృష్ణ సోమవారం తన కార్యాలయంలో విలేకరలతో మాట్లాడుతూ ఇటీవల వార్డ్ మెంబర్లు చనిపోయిన కారణంగా ఎన్ని సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు 19 వ తేదీన కేజ్యువల్ వేకెన్సీస్‌కి సంబందించిన ఎలక్షన్ కు నోటిఫికేషన్ రావడం జరిగింది అని తెలిపారు. అయితే ఈ కేజ్యువల్ వేకెన్సీస్ అనగా దురదృష్టవషాత్తు చనిపోయిన వార్డు మెంబర్స్ లింగాపురం ఒక వార్డ్ మెంబర్, పనుకువలస ఇద్దరు వార్డు మెంబర్లు, సుందరాడ ఒక వార్డుమెంబరు అనీ, ఈ నాలుగు వార్డుమెంబర్లుకు గాను మంగళవారం నుంచి నామినేషన్స్ తీసుకోవడం జరుగుతుంది అని ఎండీఓ తన కార్యాలయం లో విలేకర్లుతొ తెలిపారు.

## చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయండి

### టీడీపి నియోజక వర్గ ఇంచార్జి బోనెల

విశాలాంధ్ర - సీతానగరం : నియోజక వర్గంలోని సమస్యలు తెలుసు... గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలు తెలుసు...కార్యకర్తల సమస్యలు తెలుసు.. వాటి పరిష్కారం కోసం మీలోఒక్కడిగా ఉండి నిరంతరం కష్టపడి పనిచేయడం తనకు తెలుసని, అంతకంటే ముఖ్యమైన రేపు బుదవారం పార్వతీపురంలో జరగనున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంతా కలిసికట్టుగా సహకారాన్ని అందించాలని నియోజక వర్గ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర పిలుపునిచ్చారు. సోమవారం సీతానగరం, బలిజిపేట మండలాల టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయనకు రెండు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతంపలికి సత్కారం చేశారు. పరిచయ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. మన్యం జిల్లా ఏర్పడిన తరువాత మొదటిసారిగా ,ఎన్నికలకు సమాయత్తం అవుతున్న సంధర్భంగా, తనకు బాధ్యతలు అప్పగించిన వారంరోజుల వ్యవధిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు వస్తున్నందున ఎప్పుడూ లేనివిధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. నియోజక వర్గంలోని ప్రతీ మండలం నుంచి పెద్ద ఎత్తున జనాలను ఆటోల ద్వారా తరలించే చర్యలు తీసుకోవాలని, దీనికయ్యేఖర్చు తాను భరిస్తానని తెలిపారు. దీన్ని ఎన్నికల సభగా ఊహించి బుదవారం సాయంత్రానికి పార్వతీపురం నాలుగు రోడ్ల కూడలి వద్ద నిర్వహించే సభకు పెద్ద ఎత్తున జనాన్ని తీసుకోని రావాలని కోరారు.ఈకార్యక్రమంలో కొల్లి తిరుపతి రావు, రౌతు వేణుగోపాలనాయుడు, పెంకి వేణు గోపాలనాయుడు, సాల హరి, దామి నేని భానుప్రసాద్, గొట్టాపు వెంకట నాయుడు, బార్నాల సీతారాం, జాన్నాడ తేరేజమ్మ, శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జిలు లక్ష్మణ, రామకృష్ణ,శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## టీడీపీ మాజీ ఇంచార్జిను కలిసిన తాజా ఇంఛార్జి బోనేల విజయ్ చంద్ర

విశాలాంధ్ర - పార్వతీపురం : పార్వతీపురం మాజీ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులను వారం రోజుల కిందట కొత్త నియోజకవర్గ ఇంఛార్జిగా బాధ్యతలు చేపట్టిన బోనెల రవిచంద్ర సోమవారం నాడు కృష్ణపల్లి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు.ముందుగా వారిద్దరు కలిసి పరిచయం చేసుకున్నారు. అనంతరం ఇటీవల అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన చిరంజీవుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం బుదవారం జిల్లాకు మొదటి సారి వస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని చిరంజీవులను కొత్త ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నేతలు అభిమానులు పాల్గొన్నారు.అనంతరం పార్టీలో వర్గాలు వల్ల దూరంగా ఉంటున్న పట్టణ టిడిపి నాయకులు బార్నాల సీతారాం, కోరాడ నారాయణరావుల ఇంటికి వెళ్లి వారితో మాట్లాడి మెప్పించి తనతోపాటు తీసుకొని వెళ్ళారు.

**పార్టీ కార్యాలయంలో అడుగు పెట్టిన సీతారాం, నారాయణరావులు:** పార్వతీపురం పట్టణంలో క్రియాశీలక టీడీపీ నేతలుగా ఉన్న బార్నాల సీతారాం, కె.నారాయణ రావులు కొంతకాలంగా స్థానిక పార్టీనాయకులకు దూరంగా ఉంటూ కార్యక్రమాలు చేస్తున్న సమాచారాన్ని తెలుసుకొన్న టీడీపీ కొత్త నియోజకవర్గ ఇంచార్జి బోనేల విజయ్ చంద్ర సోమవారంవారి వద్దకు వెళ్ళి మాట్లాడి వారిని తీసుకొని పార్టీ కార్యాలయానికి వెళ్ళారు. అక్కడ టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ జగదీష్, టీడీపి నియోజక వర్గ నాయకులకు కలిపి ఇకనుండి కలిసికట్టుగా పార్టీకోసం అంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. కొంతమంది స్థానిక పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయగా ఇంచార్జి వారిని సముదాయించారు.

## కరాటే చాంపియన్షిప్ పోటీల్లో ఎస్.కోట విద్యార్థులకు పతకాల పంట

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ కరాటే చాంపియన్షిప్-2023 స్పోర్ట్స్ కరాటే, అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో విశాఖ స్పోర్ట్స్ కరాటే అసోషియేషన్ వారు ఈ కార్రక్రమాన్ని విజయవంతంగా ఆగస్టు 6న (ఆదివారం) నిర్వహించారు. ఈ పోటీల్లో శృంగవరపుకోట పట్టణానికి చెందిన కరాటే విద్యార్థులు వి.హర్థిక్ వినయ్ (బంగారు పతకం), జి.తపశ్య శర్మ (రజతపతకం), ఎస్. నీలేష్ (కాంస్య పతకం), కె.తనుశ్రీ (రజతపతకం), కె. తుసాంత్ (కాంస్యపతకం) సాధించారని కోచ్ వి. శ్రీనువాసరావు, బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేసారు. కాగా కరాటేలో చిన్నారులకు చక్కటి శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయి చాంపియన్షిప్ పోటీలకు తీసుకుని వెళ్లి పలు పతకాలు సాధించేందుకు కృషి చేసిన కోచ్ వి.శ్రీనివాసరావు, పతకాలు సాధించిన చిన్నారులను ఎస్.కోట పట్టణ ప్రజలు, చిన్నారుల తల్లిదండ్రులు అభినందించారు.

## 'జగనన్నకు చెబుదాం'కు 325 వినతులు



విశాలాంధ్ర - విజయనగరం : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వ హించిన జగనన్నకు చెబు దాం కార్యక్రమంలో ప్రజల నుంచి 325 వినతులు అందాయి. జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ వినతులు స్వీక రించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై 240, గ్రామ వార్డు సచివాలయం శాఖకు సంబంధించి 35, గృహనిర్మాణంకు 20, డి.ఆర్.డి.ఏ. 10, జిల్లా పంచా యతీ రాజ్ శాఖకు 10, పురపాలక శాఖకు 06, వైద్య ఆరోగ్య శాఖకు 04 వినతులు అందాయి.

## విత్తనాలు, ఎరువులు నాణ్యత పరీక్షలు నిర్వహించాలి



విశాలాంధ్ర - నెల్లిమర్ల : విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలు నిర్వ హించాలని విజయనగరం వ్యవ సాయ సహాయ సంచాలకులు వి హరి కృష్ణ తెలిపారు. నెల్లిమర్ల మండల కేంద్రంలో ఉన్న వైఎస్ఆర్ అగ్రి ల్యాబ్‌లో విజయనగరం, మన్యం జిల్లాల ల్యాబ్ వ్యవసాయ అధికారులకు శిక్షణ ప్రారంభించారు. ఈ శిక్షణ ఆరు రోజుల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన, ఎరువుల నాణ్యత పరీక్ష విధానాలపై అవగాహన కల్పించారు. విత్తన మొలకశాతం, తేమశాతంపై అవగాహన కల్పించారు. కార్య క్రమంలో వ్యవసాయ అధికారులు పి.శ్రీలక్ష్మి, వి.ప్రసాదరావు, ఎం సూరినాయుడు, పి లలిత, పద్మావతి విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## శ్మశానవాటిక చదును చేయించిన ఎంపీటీసీ బురిడి

విశాలాంధ్ర - సీతానగరం : మండలం లోని అప్పయ్యపేట గ్రామంలో 30 ఏళ్లుగా చేపట్టని పనిని ఎంపిటిసి బురిడి కుసుమ కుమారి సూర్య నారాయణ, గ్రామ పెద్దలు కలిసి చేప ట్టారు. ఎమ్మెల్యే జోగారావు సూచనలు మేరకు ముస్లింల స్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించి, రహదారి మార్గాన్ని, స్మశాన వాటికను జేసిబితో చదును చేయించే పనులు నిర్వహించారు. ఎంపిటిసి బురిడి సూర్యనారాయణకు, గ్రామస్తులకు ముస్లిం మత పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఈనెల 11న ఆహారకమీషన్ సభ్యులు రాక

విశాలాంధ్ర - పార్వతీపురం : రాష్ట్ర ఆహార కమీషన్ సభ్యులు ఈనెల 11న జిల్లాలో పర్యటిస్తారని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. సోమవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ఆహార కమీషన్ సభ్యులు ఇ.లక్ష్మీరెడ్డి, జి.దేవి జిల్లాలో పర్యటించనున్నట్టు ఆయన చెప్పారు. ఉద యం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అధికారులు సమగ్ర సమా చారంతో సమీక్షా సమావేశానికి హాజరు కావాలని ఆయన ఆదేశించారు. సమావేశ అనంతరం కమీషన్ సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని తెలిపారు.

## గద్దర్ పాటను బ్రతికిస్తాం

### రాష్ట్ర బహుజన కళామండలి ఉపాధ్యక్షుడు డప్పు రాజు.

విశాలాంధ్ర - వేపాడ : ఉద్యమనేత ప్రజా వాగ్దేయ కారుడు గద్దర్ భౌతికంగా మృతి చెందిన ఆయన పాటను బ్రతికిస్తామంటూ దళిత సంఘాల నాయకులు దేబార్కి కిరణ్ రాష్ట్ర బహుజన కళా మండలి ఉపాధ్యక్షుడు డప్పు రాజు అన్నారు. మండలంలోని ఆతవ గ్రామంలో డప్పురాజు కళా మండలి సభ్యులు ఆతవ నాగరాజు,కెర్రి దేముడు తదితరులు గద్దర్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.గద్దర్ మృతి కళాకారులకు తీరని లోటన్నారు.ఆయన పాటను, ఆటను,ప్రజల ముందుకు తీసుకువెళ్లి బ్రతికిస్తామన్నారు.అదే విధంగా మండల మాల మహానాడు అధ్యక్షుడు దేబార్కి కిరణ్, బంగారయ్య,తదితరులు గద్దర్ మృతికి తీవ్ర సంతాపం తెలియజేశారు.ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ గద్దర్ మృతి దళిత ఉద్యమాలకి తీరని లోటన్నారు.

## ఏజెన్సీ ట్రాన్సిజెండర్లంతా జెండర్ సర్టిఫికేట్‌లు పొందాలి

### హెల్పింగ్ హ్యాండ్ హిజ్రా అసోసియేషన్ అధ్యక్షుడు దవడ కొండబాబు

విశాలాంధ్ర - ఆగస్టు : ఏజెన్సీలో ఉన్న హిజ్రాలంతా తప్పనిసరిగా ట్రాన్సజెండర్ గుర్తింపు సర్టిఫికేట్ పొందాలని హెల్పింగ్ హ్యాండ్ హిజ్రా అసోసియేషన్ అధ్యక్షుడు దవడ కొండబాబు సూచించారు. సోమవారం హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాఅసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాంజెండర్స్ ప్రొటెక్షన్ సెల్ పై హిజ్రాలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ ట్రాన్స్ జెండర్ ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపారు. ఎవరైనా సమాజంలో ట్రాన్స్ జెండర్స్ ను హేళనకు గురిచేసిన, ఎవరైనా ట్రాన్స్ జెండర్స్ కు ఇబ్బందులు కలిగించిన 1091 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేసిన ఎడల వారి మీద చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఈ సమాజంలో అందరికీ సమాన గౌరవం కల్పించాలని ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకొని ట్రాన్స్ జెండర్స్ అందరికీ సమాజంలో ఎలాంటి వివక్షత లేకుండా గౌరవ మర్యాదలతో జీవించాలి అన్న టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని తెలియజేశారు. ట్రాన్స్ జెండర్ అందరూ సుప్రీంకోర్టు సూచన మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న ట్రాన్స్ జెండర్ సర్టిఫికేట్ ను ట్రాన్స్ జెండర్స్ అందరూ తీసుకోవాలి. ఆ ట్రాన్స్ జెండర్ సర్టిఫికెట్ తీసుకోవడం వల్ల కలిగే లాభాలు వివరించారు. అనంతరం ట్రాన్స్ జెండర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్, ఉపాధ్యక్షులు గీతా రాణి, అసోసియేషన్ సభ్యులు నందిని, చిన్ని, శృతి, మీ తోడు సొసైటీ ఫర్ ట్రాన్స్ జెండర్ పర్సన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సిస్టర్ అమిత, కురుపాం పోలీస్ డిపార్ట్మెంట్ పాల్గొన్నారు.

## ఏపీఎన్జీఓ రాష్ట్ర మహా సభలకు తరలిరావాలి

విశాలాంధ్ర - డెంకాడ : ఈ నెల 21.22 తేదీల్లో విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం లో జరిగే ఏ.పి.ఎన్జీఓ రాష్ట్ర మహా సభలకు భోగాపురం..పూసపాటిరేగ డేంకాడ మండలాల నుండి అధిక సంఖ్యలో ఉద్యోగులు తరిలి రావాలని భోగాపురం ఏ.పి.ఎన్జీ ఓ.అధ్యక్షులు కొమ్ము రు దుర్గారావు.కార్యదర్శి సంతోష్.అసోసియేషన్ అధ్యక్షులు జగదీష్.కోరారు.ఈ సందర్భముగా సోమవారం నెల్లిమర్ల నియోజక వర్గ శాసన సభ్యులు బడ్డుకొండ అప్పలనాయుడు గారి చేతులు మీదగా గోడ పత్రికను ఆవిష్క రించారు.21 వ తేదీన ఉదయం.జరిగే సభకు ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ముఖ్య అతిధి గా హాజరవుతారని అన్నారు. ఈ సమావేశం లో పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల సమస్యలు సి.పి.ఎస్. రద్దు. ఐ.ఆర్..డి.ఏ లు ప్రకటించడం. కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని కాల పరిమితి తో సంబందం లేకుండా రెగ్యులర్ చేయడం.సచివాలయం సిబ్బంది కి ప్రస్తుతం ఇస్తున్న రికార్డ్ అసిస్టెంట్ స్కేల్ కాకుండా జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ ఇవ్వడం వంటి సమస్యలపై ముఖ్యమంత్రి నీ కొరణన్నట్లు తెలిపారు.గోడ పత్రిక ఆవిష్కరణ కార్ర్యమానికి ఉద్యోగ ప్రతి నిధులు ఏ.సుధాకర్. పి.కృష్ణవేణి. లక్ష్మణరావు. వి.సత్యనారాయణ.రమణ. భాస్కర్. అక్రమ్ పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో ఉంటూ డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న కిల్లక స్వాతి అనే గిరిజన విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈమేరకు విద్యార్థిని తండ్రి కిల్లక సోములు, కుటుంబ సభ్యులతో కలసి పార్వతీపురం ఐటిడిఎ పిఓ విష్ణుచరణ్ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రంజిత్ కుమార్, కిల్లక సోములు మాట్లాడుతూ శనివారం సాయంత్రం ఐదు గంటలకు స్వగ్రామం ఇంటికి స్వాతి రావడం జరిగిందని కారణం అడిగితే తామరకు సంభందించిన మందుల కోసం వచ్చానని కుమార్తె తెలిపినట్లు, అదేరోజు రాత్రి 7గంటల సమయంలో స్వాతి తల్లిని పిలిచి తను ఏదో మందు తాగేసినట్లు తెలిపిందని వెంటనే కురుపాం ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి పంపారని ఆదివారం ఉదయం నాలుగు గంటల సమయంలో స్వాతి మృతి చెందినట్లు తండ్రి సోములు తెలిపారు. అయితే హఠాత్తుగా జరిగిన ఈ పరిణామంపై తమకు సందేహం, అనుమానం కలుగుతోందని వసతి గృహంలో ఏదైనా సంఘటన జరిగి ఉంటుందనే కోణంలో విచారణ జరిపించాలని వారు ఐటిడిఎ పిఓను కోరారు. ఈసందర్భంగా పిఓ మాట్లాడుతూ ఎఎస్పీ పోలీసు విచారణతో పాటు, శాఖాపరమైన విచారణ జరిపిస్తామని తెలిపారు. రంజిత్ కుమార్ మాట్లాడుతూ పేద గిరిజన కుటుంబమని కుటుంబంలో ఒకరికి ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. అలాగే ఐటిడిఎ అధికారులు కనీసం మృతి చెందిన విద్యార్థిని తల్లిదండ్రులను పలకరించలేదని, మృతదేహం తరలించటానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సరైనది కాదని పిఓ దృష్టికి తీసుకువెళ్లారు.

## ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులకు అవగాహన పెంచాలి

విశాలాంధ్ర - వేపాడ : ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పించి, ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం పెంచాలని విజయనగరం జిల్లా డిపిఎం సి.హెచ్.వి.వి వరప్రసాద్ అన్నారు. మండలంలోని వీలువర్తి క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో సాగు చేపట్టే ప్రకృతి వ్యవ సాయ కాంపొక్టను ఆయన సోమవారం పరిశీలించారు. చినగుడిపాల, రాయుడుపేట, ఎస్.కె.ఆర్ పురం,వేపాడ, గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను డిపిఎం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అలాగే ఆయా గ్రామాల్లో ఆవు మూత్రం,ఆవు పేడ,ఇంగువ ద్రావణం, జీవామృతం తయారీ,నియమాస్త్రం తయారీని పరిశీలించి,సూచనలు,పలు సలహాలు అందించారు. ముఖ్యంగా వరి సాగులో లైన్ షోయింగ్, అజోల్ల వేయడం వలన పంటకు మేలు జరుగుతుందన్నారు. కాంపాక్ట్ బ్లాకులలో ఉన్న రైతులంతా తప్పనిసరిగా పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయం సాగు చేయాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ కషాయాల షాపు ద్వారా ప్రతి రైతుకు కషాయాలు అందజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేపాడ,వీలువర్తి ఎస్.కె.ఆర్ పురం యూనిట్ల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సహకారంతోనే పార్కులకు మనుగడ : కమినర్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ప్రజా సహకారంతోనే పార్కులకు మనుగడని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీ రాముల నాయుడు అన్నారు. సోమవారం నగరంలోని వివిధ పార్కులను ఆయన సంద ర్శించారు. వివిఎస్ఆర్ కాలనీలో ఉన్న పార్కు వద్దకు చేరుకుని అక్కడ విస్తృతంగా మొక్కలు నాటే కార్య క్రమాన్ని పరిశీలించారు. అడవిలో ఉన్న చెట్లు మాదిరిగానే పార్కులో కూడా దట్టమైన చెట్లు పెరిగే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అక్కడున్న సిబ్బందికి సూచించారు. అలాగే ఆయా ప్రాంతాల్లో ఉన్న సచివాలయ సిబ్బందికి మొక్కల పెంపకం పై బాధ్యతను ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే నగరంలో ఆక్సిజన్ పార్కు, మహిళా పార్కు వంటి ప్రత్యేక పార్కులను రూపు దిద్దడం జరిగిందన్నారు. అలాగే సైంటిఫిక్,ఈకో పార్కుల ఏర్పాటుకు కృషి జరుగుతుందన్నారు. పార్కులలో వ్యాయామ క్రీడా సామగ్రిని కూడా అమర్చు తున్నామన్నారు. అయితే ప్రభుత్వపరంగా ఎన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినా అవి వినియోగించు కోవడంలో ప్రజా భాగస్వామ్యం తప్పనిసరని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పార్కుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అప్పుడే పార్కుల మనగడ కొనసాగుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వివిఎస్ఆర్ పార్కులో 400 వరకు మొక్కలను నాటుతున్నా మన్నారు. ప్రతి మొక్కను బ్రతికించుకోవాలన్నదే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవడమే ఈ సంవత్సర లక్ష్యమని పునరుద్ఘాటించారు.

## సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా భావించి పాలన

విశాలాంధ్ర - నెల్లిమర్ల : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి వైసిపి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు వెల్లడించారు. బొప్పడాం సచివాలయ పరిధి బుచ్చన్నపేట, పినతరిమిలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబుతో కలిసి సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను 98శాతం నెరవేర్చారని చెప్పారు. వచ్చే ఎన్నికలలో వైసిపిని ఆదరించాలని కోరారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, వైసిపి మండల కన్వీనర్ చనమల్లు వెంకటరమణ, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అదుపుతప్పి తాటిచెట్టును ఢీకొన్న కారు...కానిస్టేబుల్ రమణ గాయాలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట పట్టణంలో పోలీసు కానిస్టేబులుగా (క్రైమ్) పని చేస్తున్న శీర రమణ ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ప్రకారం.. కానిస్టేబుల్ రమణ విధులు ముగించుకుని తన కారులో ఇంటికి వెళ్తుండగా మండలంలోని గోపాలపల్లి వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న తాటిచెట్టును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రమణ తలకు, శరీరంలో పలు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ఆ మార్గంలో వెళుతున్న ప్రయాణికులు ప్రమాద సంఘటనను చూసి 108 వాహనానికి, స్థానిక పోలీసు స్టేషన్ కి సమాచారం అందించారు. 108 వాహనంలో విజయనగరంలోని కేంద్రాసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు.

## జగనన్నకు చెబుదాం అర్జీలు త్వరితగతిన పరిష్కారం చేయాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సకాలంలో సంతృప్తికర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించిన జగన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింటుకలెక్టరు ఆర్. గోవిందరావు, ప్రోజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జిల్లారెవిన్యూ అదికారి జె.వెంకటరావులతో కలిసి జిల్లాకలెక్టరు ప్రజలనుండి వినతులు స్వీక రించారు. ప్రజాసమస్యలపై జిల్లా అదికారులు, మండల అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 105 అర్జీలు సమ ర్పించారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి. జగన్నాథరావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామ చంద్ర రావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్య నారాయణ, జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్, జిల్లా ఉద్యాన అధికారి కె.వి.ఎస్.ఎన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ గౌరి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి శ్రీనివాస రావు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : కలెక్టరేట్‌ను ముట్టడించిన మున్సిపల్ కార్మికులు

### 53 మందిని అదుపులో తీసుకున్న పోలీసులు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్ వై నాయుడు,అధ్యక్షులు నాగవంశం శంకర్రావుల ఆధ్వర్యంలో మున్సి పల్ ఆప్కాస్ విధాన కార్మికుల, ఇంజనీరింగ్ వర్కర్స్ క్లాప్ ఆటో డ్రైవర్స్ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, లేదా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలు చేయాలని,క్లాప్ ఆటో డ్రైవర్లకు జీవో నెంబర్ 7 ప్రకారం 18,500/రూ:లు వేతనం ఇవ్వాలని,వీరికి బకాయి ఉన్న జీతాలు ఇవ్వాలని, ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ హెల్త్ రిస్కు అలవెన్స్ ఇవ్వాలని,ఆప్కాస్ వలన 60 సంవత్సరముల వయసు నిండినవాళ్ళు, అనారోగ్యంతో మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు పార్వతీపురం, సాలూరు,పాలకొండలో వెంటనే నియామకాలు చేపట్టాలని, పార్వతీపురం పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న పదిమంది కార్మికులకు 18,000/రూపాయలు పూర్తిస్థాయి జీతాలు ఇవ్వాలని, పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేసి ఆప్కాస్ లో చేర్చి హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు తగినంత మంది కార్మికుల సంఖ్యను పెంచిఉన్న కార్మికులపై పని ఒత్తిడిని తగ్గించాలని, మూడు సంవత్సరములుగా కార్మికులకు ఇవ్వవలసిన సబ్బులు, నూనెలు, చెప్పులు, ఇతర పనిముట్లు విడుదల చేయాలని, పార్వతీపురంలో బకాయి ఉన్న రెండు నెలల హెల్త్ అలవెన్స్ వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు ఇచ్చారు,ఈ సందర్భంలో కలెక్టర్ గానీ, వారి నియమించిన మరే అధికారి గాని వచ్చి మా సమస్యలు విని వినతి పత్రం తీసుకోవాలని నినదించారు. ఎవరూ రాకపోవడంతో కార్మికులందరూ కలెక్టర్ కార్యాలయం గేటు వద్ద గుమి గూడగా పోలీసులు వారందరినీ నిర్బంధించి తమ వాహనములలో టౌన్ పోలీస్ స్టేషన్ కు సుమారు 53 మందిని తీసుకు వెళ్లారు. అనంతరం పూచికత్తుపై అందర్నీ విడుదల చేసారు.ఈ కార్యక్రమంలో పార్వతీపురం మున్సిపల్ వర్కర్ అధ్యక్ష,కార్యదర్సులు మల్లేషు, సింహాచలం సాలూరు అధ్యక్ష,కార్యదర్సులు టి.రాముడు, టి.శంకర్రావు, పాలకొండ అధ్యక్ష,కార్యదర్సులు పి.భాస్కరరావు, సంజీవి, సిఐటియు జిల్లా కార్యదర్శి యమ్మల మన్మధరావు అధ్యక్షులు దావాల రమణారావు శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ వి.ఇందిరా సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష కార్య దర్శులు పాకల సన్యాసిరావు సంచాన ఉమా మహేశ్వరరావు మరియు పార్వతీపురం సాలూరు పాలకొండ కార్మికులు పాల్గొన్నారు.

# పూర్ణపాడు - లాబేసు వంతెన పూర్తి పై చోద్యం !

## సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న

విశాలాంధ్ర - కురుపాం : దశాబ్దాలుగా గిరిజనులకు దీర్ఘకాలిక అవసరమైన పూర్ణపాడు లాభేసు వంతెన పూర్తి పైరాజకీయ పార్టీలు చోద్యం చూస్తున్నాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోటజీవన్న ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కురుపాం లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కొమరాడ మండలంలోని 21గ్రామాల గిరిజనులు, ఇతర ప్రజానీకం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పూర్ణపాడు -లాబేసు వంతెనను పూర్తిచేయకుండా చోద్యం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎన్నికల హామీగా వాడుకుంటున్న పాలకులు**

మాజీ, తాజా ఉపముఖ్యమంత్రులు న్నా గిరిజనులకు తప్పని ఇబ్బందులు గిరిజనులకు తప్పని డోలీలా మోతలు, నదులపై ఈతలు తక్షణమే మరబోట్లను ఏర్పాటు చేయాలి. .మూడు రోజుల ముందు ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి నదిపై రెబ్బ గ్రామస్తులు వెదురు బొంగులతో చిన్నపాటి తెప్ప తయారుచేసి దానిపై జ్వరంతో బాధపడుతున్న 7సంవత్సరాల పిల్లను వైద్యము నిమిత్తం నదిలో ప్రాణాలకు తెగించి బాహ్య ప్రపంచానికి తీసుకురావడం అనే దృశ్యం మానవ హృదయాలను కలిచివేసిందన్నారు. ఇటువంటి ఎన్నో సంఘటనలు జరుగుతున్న పాలకుల్లో స్పందన లేకపోవడం అన్యాయమన్నారు. పార్వతిపురం మన్యం జిల్లాలో మాజీ , తాజా ఉపముఖ్యమంత్రులు ఉన్నప్పటికీ గిరిజనులకు ఇక్కట్లు తప్పడం లేదన్నారు. డోలీలా మోతలు నాగావళి నది ఈతలు తప్పడం లేదన్నారు . తరాలుగా పూర్ణపాడు లాభేసు వంతెన కోసం గిరిజనులు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ వంతెన నిర్మాణం కోసం వందల వేల కోట్లు అవసరం లేదని, కేవలం 10 కోట్ల రూపాయల మాత్రమే అవసరం అన్నారు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే 10 కోట్లు ఏమాత్రం అని ప్రశ్నించారు .దాదాపు తొమ్మిది పంచాయతీలు 22 గ్రామాలు 12 జనాభాకు ఉపయోగపడే ఈ వంతెన నిర్మాణం పై కనీసం శ్రద్ధ చూపకపోవడం ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం అన్నారు. 1996లో రెబ్బ - వనధార సమీపంలో నాటు పడవ మునిగి సుమారు 32 మంది మృత్యువాత పడ్డా రన్నారు. గర్భిణీ స్త్రీలు మొదలుకొని వృద్ధులు, పిల్లలు రోగాలు బారిన పడి పలువురు మృతి చెందిన సంఘ టనలు అనేకం అన్నారు, వర్షాకాలంలో నాగావళి ఆవలున్న ప్రజలకు కనీసం వైద్య గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని , దీనికి తగు చర్యలు చేపట్టాలని కోరారు. వంతెన నిర్మాణం జరిగేంత వరకు మర బోట్లను ఏర్పాటు చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య పాల్గొన్నారు,

## అగ్ని ప్రమాద బాధితరాలకు నిత్యవసరాలు అందజేత

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని చామలాపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మీగడ లక్ష్మీ కాంతమును వేపాడ మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు (సతీష్) సోమవారం పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. తన వంతు సాయంగా 50 కేజీల బియ్యం, పలు రకాల నిత్యవసరాలను అందజేయడంతో పాటు ప్రభుత్వ పరంగా సాయం అందించి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీతో పాటు వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, గ్రామ సర్పంచ్ కోలా సతీష్, ఎంపీటీసీ సభ్యురాలు చామంతుల లక్ష్మీ గంగాధర్, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - గజపతినగరం : సమస్యలు సత్వరమే పరిష్కరించాలని గజపతి నగరం ఎంపీడీవో కొవ్వాడ కిషోర్ కుమార్ ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్య క్రమం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వస్తున్న సమస్యలను అన్ని శాఖల అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : మున్సిపాలిటీలోని 30 వార్డులలో గల 15 సచివాలయాల పరిధిలో వివిధ కారణాల వలన ఖాళీ అయిన 13 వార్డు వాలంటీర్ల భర్తీ చేసెందుకు దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించబడునన్నారు.ఇతర వివరాలకు సమీపంలోని సచివాలయాలను సంప్రదించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - బెలగాం : ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమరాడ మండలం విక్రాంపురం గ్రామానికి చెందిన దండుపాటి రాములు (55) చేపలు అమ్మడానికి ఆదివారం ఉదయం మోటార్ సైకిల్పై కునేరు వెళ్లి తిరిగి వస్తుండగా పార్వతీపురం నుండి రాయగడ వైపు వెళ్తున్న లారీ కునేరు రామభద్రపురం సమీపంలో ఢీ కొట్టింది. ఈ సంఘటనలో రాములుకు తీవ్ర గాయా లయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చ్యురీకి తరలించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు ఇలా అర్ధాంతరంగా మృతి చెందడంతో వారు తీవ్రంగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## భీమసింగిలో 6తులాల బంగారం చోరీ

విశాలాంధ్ర - జామి : మండలం లోని పాతభీమసింగిలో ఓఇంట్లో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. గ్రామంలోని కంది గురునాయుడుకు చెందిన ఇంట్లో దొంగలు పడి ఇంట్లో బీరువాలో ఉన్న 6తులా బంగారాన్ని దోచుకున్నారు. త్వరలో గురు నాయుడు కుమార్తె కందిలతకు వివాహం కుదిరింది. దీనికోసం కొద్ది రోజుల క్రితం బంగారాన్ని కొనుగోలు చేసారు. సోమవారం తెల్లవారుజామున ఇంట్లో దొంగలు పడినట్లుగా గుర్తించిన వెంటనే జామి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్కోట సిఐ బాలసూర్యారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే విజయనగరం నుంచి సిసిఎస్ పోలీసులు, క్లూస్ టీం వచ్చి తనిఖీలను చేపట్టారు. కంది పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ రాజాన నరసింగరావు తెలిపారు.

## అన్న క్యాంటీన్ ఏర్పాటు ద్వారా పేదలకు ఉచితంగా భోజనాలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అయినప్పటికీ పేదలకు ఉచితంగా భోజనాలు పెట్టేందుకు 'అన్న క్యాంటీన్' ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ ఉదారతను మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న మెచ్చుకున్నారు. అన్న క్యాంటీన్ కు విచ్చేసిన పేదలు, శ్రామికులకు (5వ రోజు) సోమవారం భోజనాలను ముఖ్య అతిధులుగా విచ్చేసిన మాజీ ఎంపీపీ వెంకన్న, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొనదం మల్లేశ్వరరావు, సీహెచ్ సుబ్బారావు, ఇందుకూరి శ్రీనురాజు, మోపాడ చిన్నికృష్ణ, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్, జెడ్పీటీసీ అభ్యర్థి బీశెట్టి అరుణ, పొట్నూరు సాయిరాం, అనకాపల్లి చెల్లయ్య తదితరులు వడ్డించారు. అనంతరం మాజీ ఎంపీపీ వెంకన్న స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి స్వర్గీయ కోళ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం ప్రతిరోజూ సుమారు 300ల మందికి భోజనాలు పెట్టడం గొప్ప విషయమని, ఇందుకు ఎంతో గొప్ప మనస్సు, కృషి ఉండాలంటూ మాజీ ఎమ్మెల్యే కోళ్ల దంపతులను అభినందించారు.

## 50వ డివిజన్‌లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - విజయనగరం అర్బన్ : నగరంలో 50వ డివిజన్ రాళ్ళమాలపల్లి పరిధిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు తీరును తెలుసుకున్నారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పాలన పట్ల, అందుతున్న పథకాలు పట్ల ప్రజాస్పందన అనూహ్యంగా లభిస్తుందన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక రూపంలో పథకాలు అందడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతుందన్నారు. నవరత్నాలు అమలులో దేశంలోనే ఆదర్శంగా ప్రభుత్వ పాలన నిలుస్తుందన్నారు. దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే ప్రభుత్వ పథకాలు జమ కావడంతో ప్రజలలో సంతోషం వ్యక్తం అవుతుందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక శ్రద్ధతో నగరంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్దపీట వేసినట్లు అయిందన్నారు. స్థానిక కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి మాట్లాడుతూ తమ డివిజన్ల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మాటతప్పని మడమతిప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అర్హులైన వారందరికీ పథకాలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మరోసారి ప్రజలు ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్ర స్వామికి ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి , కార్పొరేటర్లు కంటుభుక్త తవిటి రాజు, నడిపిల్లి ఆదినారాయణ, కనకల నాగవల్లి తదితరులు పాల్గొన్నారు.

## 10న మాజీ మంత్రి పడాల అరుణ జనసేన పార్టీలో చేరిక

విశాలాంధ్ర - గజపతినగరం : తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి పడాల అరుణ సోమవారం స్వగృహ మందు మధ్యాహ్నం విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ 1987 నుండి రాజకీయంగా స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయాలకు మహిళలకు రిజర్వేషన్లు రాజకీయ రంగ ప్రవేశం చేశానని అప్పట్లో తెలుగుదేశం పార్టీలో చేరి ఎంపీపీగా మూడు సార్లు ఎమ్మెల్యేగా మంత్రిగా జిల్లా పార్టీ అధ్యక్షులుగా పనిచేశాను అన్నారు 2013 వరకు ఆ పార్టీలో ఉంటూ అనంతరం నియోజక వర్గంలో పార్టీని తప్పు పట్టించే విధంగా వర్గ విభేదాలు కారణంగా మనస్థాపం చెంది పార్టీ పట్టించుకోక పోవడంతో అలాంటి పరిణామాల్లో రెండు సంవత్సరాల క్రితం పార్టీకి రాజీనామా చేసి ఏ పార్టీలో చేరకుండా స్తబ్దతగా ఉన్న నేను ఈరోజు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు సిద్ధాంతాలు నమ్మి పార్టీలో చేరాలనుకుని ఈరోజు పార్టీ నియోజకవర్గ నాయకులతో చర్చించడం జరిగింది శుక్రవారం పవన్ కళ్యాణ్‌ను కలవడం జరిగిందని తెలిపారు. ఈనెల 10న విశాఖలో వారాహి యాత్రలో పాల్గొని ఆయన సమక్షంలో పార్టీలో చేరబోతున్నానని అన్నారు. ముఖ్యంగా మహిళలపై గాని యువతపై గాని కార్యక్రమాలు అందరితో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గజపతినగరం మండల పార్టీ అధ్యక్షులు మునకాల జగన్ గెద్ద రవి మండల పార్టీ నాయకులు నారాయణరావు భోజరాజు సత్యనారాయణ పిన్నింటి రమణ దెంకాడ మండల పార్టీ అధ్యక్షులు కృష్ణవేణి మరియు జన సైనికులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - సీతంపేట : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాలకొండ శాసన సభ్యురాలు విశ్వాసరాయి.కళావతి పాల్గొని మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాస రాయి కళావతి అన్నారు. సీతంపేట మండలం కడగండి సచివాలయ పరిధిలో గల ఒంద్రుజోల, భుచెంద్రి, సంతవలస, కడగండి వలస, కడగండి, పెద్దవంగర, పెద్దవంగర గూడ గ్రామాలలో ఉన్న అన్ని ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాలకు ఈ నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హతే కొలమానంగా సి.ఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని ప్రతీ ఒక్కరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు. పేదల చదువుకు పెద్దపీట వేస్తూ నాడు - నేడు ద్వారా సర్కారు బదులను కార్పొరేట్ పాఠశాలలుగా మార్చుతూ అన్ని మౌళిక వసతులు కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటుగా జెడ్పీటీసీ శ్రీమతి సవర.లక్ష్మి, స్థానిక సర్పంచ్ శ్రీమతి కొండగొర్రి.కుమారి, ఎంపీటీసీ శ్రీమతి సవర.శాంతి, పార్టీ ముఖ్య నాయకులు సవర.రాము, కొండగొర్రి.చంద్రరావు, సవర. తిరుపతి రావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏపీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గం ఎంపిక

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు జిల్లా అధ్యక్షులుగా సాక్షి బ్యూరో ఇన్చార్జ్ అల్లు సూరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు అలాగే ఉపాధ్య క్షులుగా బల్లమూడి నాగేంద్ర ప్రసాద్ (విశాలాంధ్ర), వి మహాపాత్రో( సూర్య) ,పంచాది అప్పారావు (పవర్), ఆరిపాక రాము (వార్త), కార్యదర్శిగా ఎం ఎస్ ఎన్ రాజు (జిల్లా వాణి), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వేదుల సత్యనారాయణ (లీడర్), సహాయ కార్యదర్శిగా సన్యాసిరావు (విశాలాంధ్ర), వి అశోక్ (సీమాంధ్ర) కోశాధికారిగా కుసుమంచి శ్రీనివాసరావు (హిందూ) తో పాటు మరో 18 మంది కార్యవర్గ సభ్యులుగా ఎంపిక అయ్యారు. వీరంతా జర్నలిస్టుల సమస్యల పరిష్కరించేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

## వరుస నాట్లు పలచన నాట్లు దిగుబడికి ఎంతో మేలు

విశాలాంధ్ర - పాచిపెంట : వరి నాట్లు వరుసగా పలుచగా వేసుకుని ఒకటే లేదా రెండు మొనలు మాత్రమే జానెడు దూరంలో నాటుకొని నాట్లు తేలికగా వేసుకుంటే దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు. రైతు టీ వెంకట మృత్యుంజయరావు బొబ్బిలి వలస గ్రామంలో తన రెండున్నర ఎకరాల పొలంలో శాస్త్రీయ పద్ధతిలో వేసిన వరి నాట్లను పరిశీలిస్తూ వరి నాట్లు బురద పదునులో మాత్రమే వేసుకోవాలని పై పైన మాత్రమే నాటుకోవాలని మొనలను భూమిలో లోపలకి గుచ్చినట్లయితే పిలకలు వచ్చే భాగం లోతుగా వెళ్లిపోవడం వలన పిలకలు ఆలస్యం అవ్వడమే కాకుండా పిలకల సంఖ్య తగ్గి తద్వారా కంకుల సంఖ్య తగ్గడం వల్ల దిగుబడి తగ్గిపోతుందని తెలిపారు. ముందుగా పొలంలో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని పూత దశలో కలియ దున్ని దమ్ములో ఎకరానికి ఒక బస్తా డిఏపి 25 కిలోల యూరియా 17 కిలోల పోటాష్ వేసుకుని వరుసలలో ఒకటి లేదా రెండు మొనలను మాత్రమే తేలికపాటి నాట్లు వేసుకుంటే దిగుబడి మూడు నుండి నాలుగు బస్తాలు దిగుబడి పెరుగుతుందని అన్నారు అంతేకాకుండా ఖర్చు తగ్గుతుందని తెలిపారు ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా తన రెండున్నర ఎకరాల వరి పంటను ప్రకృతి సేద్య పద్ధతుల ద్వారా మాత్రమే పండిస్తున్నానని ఎలాంటి ఎరువులు రసాయనాలు పురుగుమందులు వాడలేదని తనకి దిగుబడి కూడా బాగా వస్తుందని కేవలం ద్రవ ఘన జీవామృతాలతో పాటుగా వేప పిండి మరియు పశువుల గెత్తము వేస్తూ పచ్చి రొట్ట విత్తనాలను కలియ దున్ని వరి పంటను పండిస్తున్నానని దీనివలన ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో విఏఏ మోహన్ కృష్ణ సిఆర్‌పి బాలకృష్ణ ఐసిఆర్‌పి విజయ్ పాల్గొన్నారు.

## జాతీయ నులి పురుగుల దినోత్సవ పోస్టర్ విడుదల

విశాలాంధ్ర - మెంటాడ : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆగష్టు 10న జరగనున్న జాతీయ నులిపురుగులు నిర్మూలన దినోత్సవం పై మండల అధికారులు వైద్య సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఉన్న 1 నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు కిషోర్ బాలికలకు నులి పురుగుల నిర్మూలన మాత్రలు వేసుకోవటానికి వైద్య సిబ్బంది పాటు ఆశ కార్యకర్తలు అంగనవాడి కార్యకర్తలు ఉపాధ్యాయులు పూర్తి సహకారాన్ని అందించవలసిందిగా ఆయన కోరారు. ఆగస్టు 10న ప్రభుత్వ విద్యాసంస్థలు అంగనవాడి కేంద్రాలలో నులిపురుగుల నిర్మూలన సంబంధించిన మాత్రలు అందు బాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శృతి మాట్లా డుతూ పిల్లలలో కిషోర్ బాలికలలో ఎదుగుదల లోపించిన రక్తహీనతతో బాధపడుతున్న ఇతర ఇతర బలహీనతలకు లోనైనా ఈ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవడం వలన వాటన్నిటి నుండి బయటపడచ్చని ఆమె తెలిపారు. ఒకవేళ 10వ తారీఖున విద్యార్థులు అందుబాటులో లేకపోయినప్పటికీ అనంతరం నులి పురుగుల నివారణ అవగాహనపోస్టరను ఎంపీ. డిఒ., ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.డి.ఒ. పి.త్రివిక్రమ్ రావు,ఆంద్ర యస్.ఐ సిద్దార్థ కుమార్ వైద్యాధికారులు శృతి, లోకప్రియ, సీ.హెస్.ఓ సత్యనారాయణ హెచ్.వి జ్యోతి అంగన్వాడీ సూపెర్వైసర్, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరీలు దగ్ధం

విశాలాంధ్ర - మెంటాడ : మెంటాడ కేంద్రంలో ఎగువ వీధి ప్రాంతంలో పాలూరి పరుశురాంకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన సోమవారం ఉదయం సుమారు 9 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంలో పూర్తిగా ఇల్లు కాలిపోయినదని సుమారుగా 2లక్షలు ఆస్తినష్టం జరిగిందని, కట్టుబట్టలే మిగిలాయిని, సర్వం బూడిద అయిందని బాధితులు పరశురాం వాపోయారు.మాకు న్యాయం చేయాలని ప్రభుత్వం నుండి నష్టపరిహారం ఇప్పించాలని తహసీల్దార్ ఎదుట బోరున ఏడ్చారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలియజేసారు. ప్రమాద సంఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధితలకు న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు.

## చెత్తనుండి సంపద తయారీ కేంద్రాలును వినియోగించాలి

### మండల పరిషత్ అభివృద్ధి అధికారి రత్నం

విశాలాంధ్ర - మెరకముడిదాం : పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలును ఉపయోగించే విధంగా గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ బి రత్నం కోరారు. సోమవారం నాడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామకార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం డి ఓ ఎం. రత్నం మాట్లాడుతూ గ్రామంలో సేకరించిన తడి చెత్త, పొడి చెత్తలును సేకరించి చెత్త నుండి సంపాద తయారీ కేంద్రాలకు తరలి%శీ%చేదుకు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.ఈ గ్రామ్ స్వరాజ్ వెబ్సైట్ లో 2022-23 సంవత్సరం నకు సంబంధించిన పంచాయతీ వివరాలును అప్ లోడ్ చెయ్యాలని అన్నారు. కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మించుట కొరకు పంచాయితీ వారీగా నివేదికలు సమర్పించాలని తెలిపారు. పంచాయతీ స్థాయిలో ఐదు కమిటీలు వేయాలని తెలిపారు. సహజ వనరులు నిర్వహణ కార్యాచరణ, మానవ వనరులు కార్యాచరణ, జీవనోపాధి స్వయం సహాయక, ఆర్థిక కార్యాచరణ, పనులు మౌళిక వసతులు అభివృద్ధి కార్యాచరణ కమిటీలు వేయాలని తెలిపారు. ఈ కమిటీలు కు సర్పంచ్ చైర్మన్, కార్యదర్శి కన్వీనర్ గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఈఓపిఆర్డి ఎం వాసుదేవ రావు, గృహనిర్మాణ శాఖ ఏఇ వెంకటరమణ, ఎంఇఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తెగుళ్లు లేని పంటలు సేంద్రియ విధానంతో సాధ్యం

విశాలాంధ్ర - గంట్యాడ : వ్యవసాయాన్ని సేంద్రియ విధానములో అవలంబించడంతో తెగుల్లు లేని వ్యవసాయము చేయడానికి దోహదపడుతుందని ఆరోగ్యకరమైన పంటలు పండుతాయని రీజనల్ ఆర్టిఎల్ ఆర్టీవో అధికారులు ప్రకాష్ హేమ సుందర్లు అన్నారు. వ్యవసాయ ప్రాజెక్టు ప్రబంధకలు ఆధ్వర్యంలో సోమవారము వసాది గ్రామములో సేంద్రియ వ్యవసాయ సాగును పరిశీలన చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం వలన తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చునని జీవామృతాన్ని వినియోగించడం వలన రసాయనిక ఎరువులు తగ్గించుకోవచ్చని పంటలతో అవసరమైన ఎరువులు రైతులు అందుబాటులో ఉంటాయన్నారు. గట్లపై మొక్కలు రైతులు వేసేలా చూడాలని సిబ్బందికి సూచించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూర్యారావు ప్రాదేశిక సభ్యురాలు మంగమ్మ.ఈశ్వరమ్మ ఆదర్శ రైతు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 11వ డివిజన్‌లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలోని 11వ డివిజన్ అంబటిసత్రం నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, జోనల్ ఇంచార్జ్ కోలగట్ల కృష్ణారావు పాల్గొన్నారు. పేదలకు జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలు పట్ల ప్రజల స్పందన అలాగే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న తీరును వివరిస్తూ ఆ ప్రాంతమంతా కలియతిరిగారు. ఇంటింటికి వెళ్లారు. లబ్ధిదారుల బుక్లెట్లను అందజేసారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి మార్గం చూపారు. ఈ సందర్భంగా జోనల్ ఇంచార్జ్ కోలగట్ల కృష్ణారావు, వెంపడాపు శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ అర్హత ఉంటే చాలు అన్ని పథకాలు వర్తింపజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఈ విషయాన్ని ప్రజలందరూ తెలుసుకొని రానున్న ఎన్నికల్లో మరల జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తే మరిన్ని పథకాలకు చేరువవుతారని అన్నారు. ప్రతి ఇంటికి లక్షల రూపాయలలో పథకాలను అందిస్తూ జన రంజక పాలన సాగిస్తున్నారన్నారు. స్థానికంగా కోలగట్ల వీరభద్ర స్వామి నగర అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ నగరానికి కొత్త అందాలను తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. స్థానిక సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ పథకాలలో అవినీతి లంచగొండి లేకుండా పారదర్శకంగా అందుతున్నాయా లేదా అని తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చక్కటి వేదికగా నిలిచిందని అన్నారు. నేటితో 11వ డివిజన్లో ఈ కార్యక్రమం పూర్తయిందని తెలిపారు. సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేనేత వస్త్రాలు ధరించి కార్మికులకు చేయూత అందించండి

విశాలాంధ్ర - బొబ్బిలి : చేనేత వస్త్రాలు ధరిస్తే నేతన్నకు అండగా ఉండవచ్చని బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జె సి రాజు అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌సి ఎం చర్చ్ వద్ద ఉన్న వీవర్స్ కాలనీలో రోటరీ ఆధ్వర్యంలో క్లబ్ సెక్రటరీ శ్రీ హరి, పువ్వల కృష్ణ మోహన్ లు జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వీవర్స్ కాలనీలో ఉన్న పెద్దలు అల్లాడ త్రినాథ్,కె రాము,మాసబత్తుల లక్ష్మణ్,పిట్టల రాజు లకు రోటరీ అధ్యక్షులు జె సి రాజు, ఫౌండేషన్ చైర్ జి.శ్రీనివాసరావు రీజినల్ మెంబెర్ షిప్ చైర్ కె చంద్ర కిషోర్ లు పట్టు కదు వాలతో వారిని సత్కరించారు. అనంతరం అక్కడ నివసిస్తున్న 20 కుటుంబాలకు స్వీట్స్ పాకెట్స్ ను పంపిణీ చేశారు.అనంతరం జెసి.రాజు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర సముపార్జనకు ఒక సాధనంగా చేనేత నిలిచిందన్నారు. పారిశ్రామిక విప్లవంతో పవర్ లూం తో బట్టలు ఉత్పత్తి చేయటంతో చేనేత వస్త్రాలపై ఆదరణ తగ్గి కొనుగోలు చేయటం లేదన్నారు. ప్రజలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసునప్పుడే చేనేత పరిశ్రమ, చేనేత కార్మికుడు పూర్వ వైభవాన్ని పొందుతాయన్నారు. రోటరీ ఆధ్వర్యంలో చేనేత కార్మికులు నేసిన వస్త్రాలను కొనుగోలు చేశారు. చేనేత వస్త్రాలు కొనేల ప్రజలకు రోటరీ తరుపున అవగాహన కల్పిస్తామని, ప్రతి రోటరీ సభ్యుడు చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేసేలా అవగాహన కల్పిస్తామని ఆయన తెలియచేసారు. కార్యక్రమంలో వీవర్స్ కాలనీ చేనేత కార్మికులు, మహిళలు పాలగిన్నారు.

## 10 కిలోల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - గజపతినగరం : మెంటాడ మండలం కైలాం జంక్షన్ వద్ద సోమవారం ఒడిస్సా రాష్ట్రం కోరా ఫుట్ జిల్లా పంగిపుట్టు గ్రామానికి చెందిన జై రామ్ కోడా ఒడిశాలో గంజాయి కొని విజయనగరం పరిసర ప్రాంతాల్లో అమ్మడానికి వస్తుండగా కైలామ్ జంక్షన్ లో ఆటో కోసం నిరీక్షిస్తుండగా ఆయన వద్ద 10 కేజీలు గంజాయిని పట్టుకొని ఆయన్ని అరెస్ట్ చేసి రిమాండ్లకు తరలించినట్లు గజపతినగరం సీఐ ఎల్ అప్పలనాయుడు విలేకరుల సమావేశంలో తెలిపారు ఈ సమావేశంలో ఆం ద్రా ఎస్సై సిద్ధార్థ కుమార్ పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ సతీమణి మృతి

విశాలాంధ్ర - గంట్యాడ : బొబ్బిలి పార్లమెంటు సభ్యులు మాజీ ఎంపీ శ్రీ!! శే!!కొండపల్లి పైడితల్లి నాయుడు సతీమణి గజపతినగరం నియోజకవర్గ ఇన్చార్జి,మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు అమ్మ కొండపల్లి చిన అప్పయ్యమ్మ సోమవారం మధ్యాహ్నం చనిపోయారని తెలియజేయుటకు చింతిస్తున్నాం.

## చంద్రబాబూ..నీ రౌడీరాజ్యం ఇక్కడ చెల్లదు

### పుంగనూరు ఘటనపై ఎమ్మెల్యే కడుబండి

విశాలాంధ్ర - జామి : గతంలో దుర్మార్గమైన పాలన చేసి ప్రజలచేత ఛీత్కరించ బడిన చంద్రబాబు నాయుడూ నీ రౌడీ రాజ్యం పథకాలు జగనన్న పరిపాలనలో సాగవని ఎస్కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జామిలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు, పుంగనూరులో జరిగిన సంగటన అత్యంత దారుణమన్నారు. తన పర్యటన షెడ్యూల్‌లో లేని పుంగనూరు నియోజక వర్గంలోకి వెళ్ళడమే కాకుండా తమ తెలుగుదేశం పార్టీకి చెందిన గూండాలతో దాడులు చేయించడం అత్యంత కిరాతక చర్యగా అభి వర్ణిం చారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కేందుకు సిద్ధపడిన చంద్రబాబు, రాష్ట్రంలో జగన్‌కు ఉన్న ప్రజల అభిమానాన్ని చూసి తట్టుకోలేకపోతున్నారని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇటువంటి నీచమైన పనులను టీడీపీ నేతలు పాల్పడడం అనవాయితీగా మారిందన్నారు. పోలీసులపైనా, అధికారులపైనా దాడులు చేయడం మంచి విదానం కాదని సూచించారు. పుంగనూరులో టీడీపీ గూండాలు చేసిన దాడిలో దాదాపు 40 పోలీసులకు గాయాలు అయ్యాయని వివరించారు.

# నవరత్నాలతో సంక్షేమం ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర - తెర్లాం : తెర్లాం మండలంలో ఆమిటీ గ్రామ సచివాలయంలో నవరత్నాల పథకాలు అమలు చేయడంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తూ ప్రతీ ఒక్కరి జీవితాల్లో ఆనందాన్ని నింపారు అని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. సోమవారం తెర్లాం మండలంలోని ఆమిటీ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అందు తున్నాయా లేదా అని లబ్ధిదారులను ఆరా తీశారు.నాలుగేళ్ళ ప్రభుత్వ పాలనలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధిని తెలియజేసే బుక్ లెట్లను అందజేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తమ వద్దకు వచ్చిన ప్రతి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.సంక్షేమ క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేశారని కావున ప్రజలంతా ఈ విషయాలను గమనించి 2024 ఎన్నికల్లో సీఎం జగన్మోహన్ రెడ్డి గారికి తోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాల నాయుడు, ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, వైసీపీ నాయకులు నర్సుపల్లి బాబ్జిరావు, తెర్లీ బసవన్న, తెర్లీ అప్పల నాయుడు, జాగన మాధవ నాయుడు, తెంటు సత్యం నాయుడు, మర్రాపు జగన్నాథం, ప్రభుత్వ అధికారులు, వివిధ గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.